ప్రజాశక్తి

శనివారం 30 ఆగస్టు 2025

5

పార్వతీపురం మన్యం

3న పార్వతీపురంలో జాబ్ మేళా

పార్వతీపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా సెప్టెంబర్ 3న పార్వతీపురంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 30 ఏళ్ల లోపు గల నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చున్నారు. సెప్టెంబర్ 3న ఉదయం 9 గంటల నుంచి స్థానిక శ్రీ సాయిరామ్ డిగ్రీ కాలేజ్‌లో జాబ్ మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ జెరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 91772 97528, 89788 78557ను సంప్రదించాలని తెలిపారు.

బిసి నాయకులకు నాయకత్వ పగ్గాలు?

- టిడిపిలో పెరుగుతున్న డిమాండ్
- అధికార పార్టీ జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ
- మన్యం జిల్లా రూపురేఖలు మార్చే యోచనలో ప్రభుత్వం

ప్రజాశక్తి - పార్వతీపురం

అధికార పార్టీలో బిసి నినాదం నివురుగప్పిన నిప్పులా రగులుతోంది. బిసిలు ఎక్కువగా ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకొనేందుకు పావులు కదుపుతోంది. అరుకు పార్లమెంటు నియోజకవర్గాన్ని రెండు జిల్లాలుగా విభజించి పార్వతీపురం మన్యం జిల్లా టిడిపి అధ్యక్షుడిగా బిసి నాయకునికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల విశాఖపట్నంలో అరుకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో పలువురు బిసి నాయకులు పార్టీ పరిశీలకుల దృష్టికి తమ మనసులోని మాట తీసుకెళ్లారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం, పాలకొండ, సాలూరు, పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గాలు వున్నాయి. వీటిలో మూడు ఎస్టీలకు, ఒకటి ఎస్సీలకు రిజర్వ్ చేయబడ్డాయి. అయితే ఈ నాలుగు నియోజకవర్గాల్లోనూ 70శాతానికి మించి బిసి జనాభా వున్నారు. వీటిలో రెండు ప్రధాన బిసి సామాజిక వర్గాలకు చెందిన నాయకుల అండదండలతోనే ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు గెలుపు సాధిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో జనాభా 9, 25,340 మంది వున్నారు. వీరిలో ఎస్సీ జనాభా 1,10,169 మంది కాగా, ఎస్టీలు 2,60,419మంది ఉన్నారు. బిసిలు, ఒసిలు కలిపి 5,54,752 మంది ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ జనాభా కంటే రెట్టింపు బిసి జనాభా జిల్లాలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పార్వతీపురం మన్యం జిల్లా టిడిపి అధ్యక్షుడిగా బిసి నాయకుడే ఎంపిక కావాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు కూడా పార్వతీపురం డివిజన్ కి చెందిన బిసి నాయకుడే టిడిపికి అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషిస్తున్న తమకు జిల్లా పార్టీ పగ్గాలు ఇవ్వాలని బిసి నాయకులు కోరుతున్నారు. అరుకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పాడేరు, అరుకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో 80శాతం పైగా గిరిజనులు ఉన్నారు. ఈ మూడు ఎస్టీ నియోజకవర్గాలతో కలిపి ఉన్న జిల్లాకు ఎస్టీ నాయకుడ్ని అధ్యక్షుడిగా నియమిస్తే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మన్యం జిల్లాలో ఉన్న టిడిపి బిసి నాయకులంతా వారి అభిప్రాయాలను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళే ప్రయత్నం చేయనున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

జిల్లా రూపురేఖలు మార్చే యోచనలో ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో జిల్లాల కూర్పు సక్రమంగా జరగలేదనే వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆరుగురు మంత్రులతో ఒక సబ్ కమిటీని నియమించింది. జిల్లా, మండలం, గ్రామాల సరిహద్దుల మార్పులు, చేర్పులపై అభిప్రాయాలు, అభ్యంతరాలు మంత్రివర్గ కమిటీకి తెలపాలని ప్రభుత్వం ఇప్పటికే కోరింది. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న మన్యం జిల్లా రూపురేఖలు మార్చాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. జిల్లా పేరులో మన్యం తొలగించి పార్వతీపురం జిల్లాగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కనిపిస్తోంది. ఇప్పుడున్న పాలకొండ నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలో కలిపి విజయనగరం జిల్లాలో ఉన్న బొబ్బిలి నియోజకవర్గాన్ని పార్వతీపురం జిల్లాలో విలీనం చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. త్వరలో జిల్లాకు రానున్న మంత్రివర్గ కమిటీకి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు వినతులు అందజేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పార్వతీపురం జిల్లా టిడిపికి అధ్యక్షుడిగా బిసి నాయకుడ్ని ఎంపిక చేయడమే ఉత్తమమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వికలాంగుల పింఛను అపీలుకు నేడు ఆఖరు

ప్రజాశక్తి - పార్వతీపురం

వికలాంగుల పింఛను విచారణకు వచ్చిన వారికి నోటీస్‌లు జారీ చేయడం జరిగిందని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి తెలిపారు. నోటీసులు అందుకున్న అభ్యర్థులు శనివారం సాయంత్రం 5 గంటల్లోగా ఆన్ లైన్‌లో అప్పీల్ చేయవచ్చున్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగి అప్పీల్ వేసిన వారికి ఒకటో తేదీన పింఛను పంపిణీ జరుగుతుందన్నారు.

కొత్తవలసలో నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని కొత్తవలసలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కెవి కొత్తవలస ఫీడర్‌పై ఉన్నటువంటి వీధులకు, ఆర్‌డిఎస్‌ఎస్ లైన్ నిర్వహణ పనులు జరుగుతాయని, దీనివల్ల కొత్తపోలమ్మ కాలనీ, నవీరి కాలనీ, గిజబ కాలనీ, కొత్తవలస మెయిన్ రోడ్ వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారుల సహకరించాలని కోరారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సామాన్యులకు సైతం తెలుగును వ్యవహారిక భాషగా కృషి చేసిన మహానుభావుడు గిడుగు రామ్మూర్తి అని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. అటువంటి మహనీయుడు ఈ ప్రాంతానికి చెందిన వారు కావడం గొప్ప విశేషమని అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలను వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాడుక భాష ఉద్యమానికి ఆద్యులు , బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. గిరిజన సవర బాషకు లిపిని అందించారని, వారి కృషి ఫలితంగా భాష పేరుతో దేవాలయం ఉండడం గర్వకారణమని ప్రశంసించారు. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తుగా గిడుగు రామ్మూర్తి జయంతిని మాతృ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు గుర్తు చేశారు. తెలుగు వికాసానికి పాటుపడిన కందుకూరి విరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి చరిత్రలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వారు కృషి చేసిన తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, తెలుగు భాష చిరస్థాయిగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగులో ప్రబంధ, భక్తి, ఆధునిక కావ్యాలు ఉన్నప్పటికీ మనకున్న సాహితీ, కవి సంపదను కాపాడుకోవాలన్నారు. మనుషుల మధ్య తత్సంబంధాలు భాషతో పెరుగుతాయని, అటువంటి తెలుగును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తెలుగు పట్ల మక్కువ పెంచుకోవాలని, గ్రంథాలయాలకు వెళ్లి తెలుగుపై జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలని, ప్రముఖుల రచనలను ఆస్వాదించాలని కోరారు. విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5న తెలుగు మాస పత్రికను విడుదల చేయనున్నామని, అందులో విద్యార్థులకు అవసరమైన సమాచారంతో పాటు విద్యార్థుల రచనలు ఉంటాయని ప్రకటించారు.

తొలుత విశ్రాంత తెలుగు పండితులు, రచయిత గంటేడ గౌరినాయుడు గిడుగు రామ్మూర్తి తెలుగును వాడుక భాషగా సామాన్య ప్రజల్లోకి తీసుకువచ్చారని కొనియాడారు. జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ ఆలపించిన తేనెల తేటల మాటలతో మన దేశ మాతను కొలిచెదమా గీతానికి, రచయిత చింతా అప్పలనాయుడు వినిపించిన కవితకు, మరో రచయిత మల్లిపూడి జగదీశ్వరరావు ఆలపించిన మా దేశం భారతదేశం గీతం, జిసిడిఒ భారతి ఆలపించిన తేనె కన్నా తీయనిది తెలుగు బాష గీతాలకు ఆహూతులు మంత్ర ముగ్దులయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరర్ డిసిహెచ్ శర్మ తెలుగు బాష పట్ల ఔన్నత్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కవులకు, రచయితలకు దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. నృత్యం చేసిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి, డిపిఆర్ఒ ఎల్.రమేష్, సాహితీవేత్తలు సిరికి స్వామినాయుడు, పక్కి రవీంద్రనాథ్, పాలకొల్లు రామలింగస్వామి, చందనపల్లి గోపాల్, పల్లా రోహిణికుమార్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిడుగు చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కవులు, రచయితులను సత్కరిస్తున్న కలెక్టర్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ

జిఒ 3కు ప్రత్యామ్యాయం కల్పించాలి

- స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి
- గిరిజన అభ్యర్థులను ఆదుకోవాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ 3కు ప్రత్యామ్యాయం కల్పించి, ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన అభ్యర్థులకు స్పెషల్ డిఎస్‌సి ప్రకటించి గిరిజన అభ్యర్థులను ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ ప్రభుత్వాన్ని కోరారు. గుమ్మలక్ష్మీపురంలోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యాన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో అరుకు బహిరంగ సభలో సిఎం చంద్రబాబునాయుడు జిఒ 3కు ప్రత్యామ్యాయం తీసుకొస్తామని గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ అభ్యర్థులకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి చర్యలు కానరావడం లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయంగా గిరిజనశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జిఒ 3కు ప్రత్యామ్యాయంగా మరో జీవో తీసుకువస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. గతంలో ఇచ్చిన 16,347 డీఎస్సీ పోస్టుల్లో ఎలాంటి స్పెషల్ డిఎస్సి ప్రకటించకుండా విడుదల చేయడం బాధాకరమన్నారు. దీనివల్ల గిరిజన యువత నష్టపోతుందని, ఉద్యోగ, ఉపాధి లేక నిరుద్యోగం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1న జిఒ 3కు ప్రత్యామ్యాయం చూపాలని, గిరిజన ప్రాంతంలో స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో జరగబోయే నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు, గిరిజన సంఘాలు, గిరిజన మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పువ్వల తిరుపతి రావు, బి.వెంకటరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, గంగారావు, యువజన సంఘం నాయకులు ఎం సన్యాసి, బి సత్యం పాల్గొన్నారు.

వైద్యుల కోసం రోగుల ఎదురుచూపులు

ప్రజాశక్తి -పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ ఏరియా ఆసుపత్రిలో మధ్యాహ్నం 11 గంటల వరకు వైద్యులు ఎవరూ రాకపోవడంతో రోగులు ఎదురుచూసే పరిస్థితి కనిపించింది. ఒపి విభాగంలో రోగుల తాకిడి ఎక్కువగానే ఉంది. అయితే వైద్యులు ఒపికి రాకపోవడంతో రోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి కనిపించింది. సుమారు 300 వరకు రోగులు ఒపికి హాజరయ్యారు. అయితే వైద్యులు లేకపోవడంతో రోగులు ఒపి భాగంలో వేచి చూడాల్సి పరిస్థితి దాపురించింది. వైద్యులు ఆ సమయంలో సమావేశం నిర్వహించుకున్నట్లు తెలుస్తుంది. ఒపి సమయంలో సమావేశమేమిటని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

ప్రాధాన్యతా అంశాల పట్ల అవగాహన తప్పనిసరి

రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యత అంశాల పట్ల పూర్తిగా అవగాహన ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రెవెన్యూ అధికారులకు సూచించారు. అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ పాత్ర కీలకమని, ప్రజలకు అవసరమైన అన్ని పత్రాలను జారీ చేసేది రెవెన్యూ శాఖేనన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై వారి అవసరాలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. మండల స్థాయిలో తహశీల్దారుతో పాటు విఆర్ఒ, విఆర్ఎ, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు అందరూ ఇందులో భాగస్వాములేనని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇచ్చిన లక్ష్యాలు సాధించాలంటే అవగాహన ముఖ్యమని, అందుకు ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై స్పష్టమైన అవగాహన తప్పనిసరని ఉద్బోధించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఇతర రెవెన్యూ అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించగా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్ భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కార్యదర్శులకు అవగాహన కల్పించాలని తహశీల్దార్లను ఆదేశించారు. పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం తెలియజేస్తామన్నారు. ముఖ్యంగా భూ సమస్యల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల్లో భాగంగా ప్రభుత్వ భూమి పెద్ద మొత్తంలో కావాల్సి ఉందని, కావున దాన్ని సేకరించాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయం నుంచి అందిన ఆదేశాలను 15 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని, జాప్యం చేస్తే ఊరుకోబోమని అన్నారు. ప్రభుత్వం చెరువులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతుందని, కావున రెవెన్యూ రికార్డుల మేరకు చెరువులను సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుందని, కావున జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. కోర్టు కేసుల విషయమై నిర్ణీత గడువు లోగా సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. నీటి పన్ను వివరాలు ఆన్ లైన్‌లో నమోదు కాబడుతున్నాయని, ఆ మేరకు పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. నీటి పన్నుల ప్రగతి వారంలోగా కనిపించాలని, ఇంటి స్థలం కోసం అర్హులైన ప్రతి ఒక్కర్నీ ఎంపిక చేయాలని అన్నారు. భారీ వర్షాల సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కార్యాలయానికి చెందిన జిఒలు, సర్క్యూలర్లు, ఉత్తర్వులు తదితర పత్రాలను ఇపిటిఎస్‌లో నమోదు చేయాలన్నారు. రోజుకి కనీసం 500 పేజీలనైనా అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. చిన్న చిన్న సమస్యలతో ప్రధాన కేంద్రంలోని పీజీఆర్ఎస్‌కు ప్రజలు రాకూడదని, అటువంటి సమస్యలను మండలస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ వివరించారు. సమీక్షా సమావేశంలో ఎస్డీసీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, ఇతర రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జెసి, సబ్ కలెక్టర్లు

1న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను సెప్టెంబర్ 1న పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై శుక్రవారం డిఆర్‌డిఎ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటో తేదీన పింఛన్ పంపిణీకి మొత్తం సర్వం సన్నద్ధం చేయాలన్నారు. 40 శాతం పైగా అంగవైకల్యం వారికి నోటీసులు జారీ చేశామని, తదనుగుణంగా ఆన్లైన్లో అప్పీల్ చేసుకున్న వారికి పింఛను పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వచ్చిన అప్పీల్‌ను విధిగా ఆన్లైన్ చేయాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు గ్రామాల్లో స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

కౌశలంలో అప్లోడ్ చేయాలి

నిరుద్యోగ యువతీ, యువకుల వివరాలను కౌశలం పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిరుద్యోగ యువతీ, యువకుల ధ్రువీకరణ పత్రాలు, ఇ- మెయిల్, మొబైల్ వివరాలను నమోదు చేయాలని ఆయన చెప్పారు. నమోదు చేసిన అభ్యర్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పించడానికి అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జి.నాగభూషణ రావు, డిప్యూటీ కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని పురోహితునివలసలో గల ఆదర్శ పాఠశాల జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు (క్రీడా ప్రతిభ అవార్డు) 2025 సంవత్సరానికి గానూ ఎంపికవ్వడం, ఈ అవార్డును జిల్లా అధికారుల చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ డాక్టర్ అన్న శామ్యూల్ లంక తెలిపారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ప్రభుత్వం)వారు ప్రతి ఏటా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో స్కూల్ గేమ్స్ క్రీడా విభాగంలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లాలో గల 5 ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా ప్రతిభ అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 2025 సంవత్సరానికి గానూ తమ పాఠశాల ఎంపికవ్వడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్ రవి మాట్లాడుతూ మోడల్ స్కూల్ వరుసగా మూడో సారి క్రీడా ప్రతిభ అవార్డుకు ఎంపికవ్వడం సంతోషముగా ఉందని, విద్యార్థులను క్రీడల్లో ఇంకా ఉన్నత స్థాయిలో రాణించేలా నిరంతరం తర్ఫీదును ఇస్తామని తెలిపారు.

అవార్డును అందుకున్న ప్రిన్సిపల్, పిఇటి

దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుభాయి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మహిళా భద్రత సైబర్ నేరాలపై సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి, ఖైనీ, గుట్కాలు చెడు వ్యసనాలకు దూరంగా యువత ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. క్రైమ్ వివరాలను తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ చంద్రమౌళి, ఎస్ఐ లు ఎస్‌కె మస్తాన్, వై.అమ్మన్నరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పట్టణంలో కురుస్తున్న భారీ వర్షం

భారీ వర్షానికి రోడ్లు జలమయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పట్టణ ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన కాలువల్లో పూడికలు తీయకపోవడంతో ఎప్పటికప్పుడు ఈ పరిస్థితి పునరావృతమవుతుందని పట్టణ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. అటు కౌన్సిలర్లకు , ఇటు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు పరిస్థితిపై చీమకుట్టినట్లైనా లేకపోవడం గమనార్హం. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పూడిక తీత పనులపై దృష్టి సారించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రొఫెసర్ రవిని అభినందించిన మంత్రి

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం ఆర్‌జియుకెటి అసిస్టెంట్ ప్రొఫెసర్ స్టూడెంట్ డీన్, మన్య ప్రగతి చైర్మన్ డాక్టర్ గేదెల రవిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. రవి ఐఐటి గౌహతి నుండి పిహెచ్‌డి పట్టా ఇటీవల కాలంలో అందుకున్న సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో అచ్చెన్నాయుడును కలిశారు. ఈ సందర్భంగా రవి విద్యా ప్రావీణ్యాన్ని మంత్రి కొనియాడుతూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

రవిని అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజా దర్బార్ ద్వారా తెలుసుకొని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రజలు తమ తమ సమస్యలను వినతుల ద్వారా ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎఫ్‌ఎసి కమిషనర్‌గా శ్రీనివాసరాజు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసరాజుకు ఎఫ్‌ఎసి కమిషనర్‌గా నియమిస్తూ శుక్రవారం సిడిఎంఎ కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. శుక్రవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన ఆగస్టు జీతాలు లేనట్లేనా అన్న వార్తకు స్పందించి ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో మున్సిపల్ కార్యాలయ పరిధిలో గల 303 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది జీతాలు సెప్టెంబర్ 6 నుంచి 10వ తేదీ లోపు పెట్టుకొనే అవకాశంతో పాటు, అభివృద్ధి పనులు బిల్లులు, కార్యాలయ బిల్లులు, ఆయిల్ బిల్లులు పెట్టుకునేందుకు అవకాశం ఉండడం గమనార్హం.

అన్నదానం చేపడుతున్న వెంకంపేట గ్రామ యువత

వెంకంపేటలో అన్నదానం

ప్రజాశక్తి- పార్వతీపురం

మండలంలోని వెంకంపేటలో వినాయక మహోత్సవాల సందర్భంగా కొప్పల వెలమ రామ మందిరం కమిటీ యువకులు శుక్రవారం అన్నదానం నిర్వహించారు. కొట్టేడ శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా ఈ అన్నదానం కార్యక్రమానికి రూ.10వేలు విరాళాలం ఇచ్చినట్లు యువకులు తెలిపారు. కార్యక్రమంలో సుమారు 500మందికి పైబడి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్టు కమిటీ యూత్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ సెంటర్ వద్ద నీలకంఠాపురం ఎస్సై ఎ.నీలకంఠరావు శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం వేసి రహదారి భద్రత నియమాలు, సైబర్ క్రైమ్ నేరాలు, మహిళ భద్రత, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఐదేళ్లగా గ్రామంలో గల విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పుతూ వారిని మంచి ప్రయోజకులుగా తీర్చిద్దిడంలో విశేషంగా కృషి చేస్తూ గ్రామంలో అందరితో కలిసి మెలసి ఉన్న మరిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ కుమార్, ఈశ్వరరావు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మరిపల్లి పాఠశాల నుండి దండిగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నకు బదిలీపై వెళ్తున్న ఈ ఉపాధ్యాయులను విద్యార్థులు, తల్లిదండ్రులు, సర్పంచ్ తొత్తడి నారాయణమ్మ, ఎంపిటిసి సభ్యులు జన్ని సీతారాం, గ్రామ పెద్దలు పోలినాయుడు, వెంకటరమణ, చిన్న, యువత సన్మానించారు.

నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

ప్రజాశక్తి - కురుపాం

నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మన్యం జిల్లా నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కె.సందీప్ కుమార్ ఆధ్వర్యంలో నేత్రదానంపై ర్యాలీ నిర్వహించి అనంతరం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతు కార్నియల్ అంధత్వంతో చూపు కోల్పోయిన వారికి నేత్రదాతల నుంచి సేకరించిన కార్నియా మార్పిడి ద్వారా కంటి చూపును ప్రసాదించవచ్చునని, కావున ప్రజలంతా అవగాహన చేసుకొని నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి మాట్లాడుతూ వ్యక్తి మరణానంతరం ఆరు గంటల్లో నేత్రాలను సేకరించాల్సి ఉంటుందని, మరణాంతరం దాతకు తలకింద తలగడ ఉంచి రెండు కళ్లను మూసివేసి నీటిలో ముంచిన తడిదూది గానీ, గుడ్డ గానీ పైన ఉంచి చనిపోయిన వెంటనే నేత్ర నిధికి గానీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గానీ తెలియపర్చితే కార్నియాలు సేకరించినప్పుడు సహకారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ సృజన, హెడ్ నర్స్ బాలామణి, కురుపాం నియోజకవర్గ హిజ్రాల అసోసియేషన్ అధ్యక్షులు ఎ.గీతారాణి, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నేత్ర వైద్యాధికారులు సిబ్బంది, రోగులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తెలుగును వ్యవహారిక భాషగా కృషి చేసిన మహానుభావుడు గిడుగు రామ్మూర్తి, దేశంలో క్రీడా రంగానికి చిరస్మరణీయమైన కీర్తి తెచ్చిన మేజర్ ధ్యానచంద్ జన్మదినం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ స్పోర్ట్స్‌డేను జిల్లాలోని పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారభాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. వారు చేసిన సేవలను కొనియాడారు.

కురుపాం : స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాష ప్రాముఖ్యతకు సంబంధించిన పాటలతో నృత్యాలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకటరమణమూర్తి, భారత క్రీడారంగానికి చిరస్మరణీయమైన కీర్తి తెచ్చిన మేజర్ ధ్యాన్ చంద్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక గిరిజన బాలికల ఆశ్రమం ఉన్నత పాఠశాలలో నేషనల్ స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు స్పోర్ట్స్, తెలుగు భాష దినోత్సవం అక్షర రూపంలో ఆకృతిని ప్రదర్శించడం పలువుర్ని ఆకట్టుకున్నాయి . ఈ సందర్భంగా స్పోర్ట్స్ డే, తెలుగు భాషా దినోత్సవం ప్రాముఖ్యతను ప్రధానోపాధ్యాయులు వసంత లక్ష్మి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎలో....

జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమాలను స్థానిక ఐటిడిఎలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ గున్న రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి ఎనలేని కృషి చేశారని అన్నారు. తెలుగు భాషను సరళతరం చేయడంలో గిడుగు కృషి చాలా గొప్పదన్నారు. క్రీడా రంగానికి మేజర్ ధ్యాన్ చంద్ చాలా కృషి చేశారని, క్రీడాకారులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎఒ వి.సునీల్, ఉప విద్యాశాఖ అధికారి జి.రామ్మోహన్ రావు, ఐటిడిఎ అకౌంట్స్ అధికారి విజయరాణి, డిడి సెక్షన్ సుపరింటెండెంట్ అప్పారావు, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో

మండలంలోని పులిపుట్టి సమీపంలో ఉన్న భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో శుక్రవారం తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాష ప్రావీణ్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్కృతి పండితులు బౌరోతు శంకరరావు, వాల్మీకి వనవాసి శ్రేయ సంస్థ అధ్యక్షులు ఎస్‌పి పెంటయ్య మాస్టర్, ప్రిన్సిపల్ ఎస్.నవీన్, కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయ వస్త్రాధారణలో ఉన్న కురుపాం మోడల్ స్కూల్ విద్యార్థినిలు

స్పోర్ట్‌డే, తెలుగు అక్షరరూపం ఆకృతిలో ఉన్న సీతంపేట గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు

వీరఘట్టం: మండలంలో పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తెలుగు భాష అమ్మ వంటి కమ్మనైనదని ఇలాంటి గొప్ప భాషను కలకాలం కాపాడుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవరం విద్యార్థులకు సూచించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు శాఖ అధ్యక్షులు, వైస్ ప్రిన్సిపాల్ రామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సందర్భంగా వ్యవహారిక భాషా ఉద్యమ కర్త గిడుగు రామమూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు కల్పన శ్రీవాణి, తులసి, సత్యారావు, చిన్నారావు, కృష్ణారావు, జమ్మయ్య రాజు కథలు, అవధానంలోని సమస్య పురాణం, దత్తపదులకు సంబంధించిన పద్యాలు చదివి వినిపించారు.

ఎస్‌సి వర్గీకరణ పేరిట కుట్ర

మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్.ఎస్.రత్నాకర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశవ్యాప్తంగా కుట్ర జరుగుతోందని, ఎస్సీ వర్గీకరణతో దళితుల ఐక్యతపై బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ కుట్ర పన్నుతున్నారని, ఈ కుట్రలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబునాయుడు భాగస్వాములుగా ఉన్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్‌ఎస్ రత్నాకర్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. గత 25ఏళ్లగా ఎస్సీ వర్గీకరణపై ఉద్యమం జరుగుతుందని, చంద్రబాబునాయుడు మాల సామాజిక వర్గంపై పగబట్టి తొక్కేసే కార్యక్రమాన్ని భుజాన్ని వేసుకుని నడిపిస్తున్నారని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై తెలుగు రాష్ట్రాల్లో కత్తిగట్టాయని, దళితులను ముఖ్యంగా మాలలను ఏకంగా వాడుకున్నరని, దీనిపై జగన్మోహన్‌రెడ్డి కూడా కనీసం నోరు మెదపకపోవడం ఈనాటికి తన ఉద్దేశం ఏమిటో చెప్పకపోవడం అత్యంత బాధాకరామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కులాన్ని, మతాన్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని విభజించి, దేశాన్ని అమ్ముకునే పనిలోపడ్డారని ధ్వజమెత్తారు. మోడీతో సహ గుజరాతీ పరివారం మొత్తం ఎన్నికల కమిషన్‌ను పావుగా వాడుకుని దొంగతనంగా గెలిచి, తన పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. రిజర్వేషన్ పేరుతో ఎంగిలి మెతుకులు పడేసి, అందులో వాటాల కోసం కొట్టుకు చావండి అనే ఉద్దేశంతోనే ఈ ఎస్సీ వర్గీకరణ దళితుల్లో పైకి తేవడం జరిగిందని, ఈ రిజర్వేషన్ల వల్ల వందల మందికి మాత్రమే న్యాయం జరుగుతుందని, మిగతా దళితులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థల్ని మోడీ నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఎలక్షన్లు రద్దుచేసి స్వతంత్రంగా బ్యాలెట్ పేపర్‌తో గెలిచి తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. కుల, మతాల పేరుతో ప్రజలను విభజించి పాలించే పద్ధతి ఎంతో కాలం కొనసాగదన్న విషయాన్ని బిజెపి గమనించాలన్నారు. చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి మాల సామాజిక వర్గంపై కక్ష సాధింపు విషయంలో ఇకనైనా పునరాలోచన చేసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ తప్పని, వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్సీ వర్గీకరణ తాత్కాలికమేనని అన్నారు. పార్లమెంట్లో సవరణ చేసేంత వరకూ ఇప్పుడు ఇచ్చిన ఏడుగురు జడ్జిల తీర్పును పునః సమీక్షించేంత వరకు నిరంతరం శాంతియుతంగా పోరాటం కొనసాగుతుందని అన్నారు. విలేకరుల సమావేశంలో మాల మహానాడు నాయకులు రేగిడి రామకృష్ణ, దుర్గా ప్రసాద్, సూర్ల వెంకట రమణ, మజ్జి సతీష్, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారికి వినతిని అందజేస్తున్న 25వ వార్డు ప్రజలు

మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రతిపాదన విరమించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 25వ వార్డులో గల మద్దాలవారివీధిని (బొగ్గులవీధి) మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి 2041 సంవత్సరం వరకు ఉన్న ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆ వీధి ప్రజలు అభ్యంతరం తెలుపుతూ పట్టణ పౌరు సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ వెంకట నారాయణరావుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. సందర్భంగా ఈ వీధి ప్రజలు మాట్లాడుతూ సుమారు 400 మీటర్ల వైశాల్యం 20 అడుగుల రోడ్డు తమ వీధి గుండా వేయడం వల్ల సగానికి సగం ఇళ్లు లేచిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తామంతా కుల, చేతివృత్తులు, రోజువారీ కూలిపనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ ప్రతిపాదన అమలు అయితే వీధిలో సగానికి పైగా ఇళ్లు ఉండని ఆందోళన వ్యక్తం చేశారు. కమర్షియల్ జోన్‌గా మారి పన్నులు పెరిగితాయని, పెరిగిన పన్నులపై ప్రతి ఏటా మార్కెట్ విలువపై 15 శాతం మళ్లీ పన్నులు పెరుగుతాయని తెలిపారు. ఇన్ని ఇబ్బందులున్నందున ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు.

ఆది కర్మయోగి అభియాన్‌తో గిరిజన గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

ఆది కర్మయోగి అభియాన్ పథకంలో భాగంగా ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది కర్మయోగి అభియాన్ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ప్రారంభించిన ఒక ఉద్యమమని, దీని లక్ష్య గిరిజన ప్రాంతాల్లో పాలన, సేవా పంపిణీ, మరియు అభివృద్ధిని మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం నాయకులకు శిక్షణ ఇచ్చి, వారికి నైపుణ్యాలను అందించడం ద్వారా గిరిజన ప్రాంతాల్లో సేవలను మెరుగుపర్చడం, సామాజిక సమస్యలను పరిష్కరించడం, స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఎంఇఒ జామి నారాయణస్వామి, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, మండల ఇంజినీరింగ్ అధికారి ఫనీస్, వైద్యాధికారి శిరీష, ఎన్జీవో సభ్యులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌కో ఎఇగా సోమేశ్వరరావు

వీరఘట్టం : స్థానిక ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీరుగా కె.సోమేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బొబ్బిలి డి- 2 సెక్షన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎఇగా బాధ్యతలు నిర్వహించిన కె.అనిల్ కుమార్ బదిలీపై శ్రీకాకుళం వెళ్లారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కోటిపాం పంచాయతీ కోటిపాం కాలనీ వద్ద, గుమడ, కోటిపాము గ్రామాలకు చెందిన రైతులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాంబమూర్తి మాట్లాడుతూ గుమడ, కోటిపాంకు చెందిన చిప్పాడ గౌరు నాయుడు, పి.తిరుపతి రావు, పి.పకీరు పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయన్నారు. పంట పూర్తిగా నష్టం జరగడంతో ఈ కుటుంబాలు అప్పులు చేసి డబ్బులకు అప్పులు తీర్చుకోలేక చిన్నాభిన్నమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తున్న నేపథ్యంలో ఇలా ఏనుగులు పూర్తిగా ధ్వంసం చేయడంతో ఆ రైతులు లబోదిబోమనే పరిస్థితి ఉందని అన్నారు. దీంతో రైతులు ఇబ్బంది పడుతుంటే శుక్రవారం అటవీ రేంజర్ మణికంఠేశ్వరరావు వచ్చి గుమడ గ్రామానికి చెందిన రైతుల పరిశీలించారన్నారు తప్ప రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఎవరూ పంటను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తిరుపతిరావు, పకీరు, ధర్మ, సంజీవి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

పార్వతీపురం అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి.. పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంగా ఏర్పడిన పార్వతీపురం అభివృద్ధిలో రైల్వేలు కీలక భాగస్వామ్యం, సహకారం అందించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. భువనేశ్వర్‌లో శుక్రవారం జరిగిన రైల్వే జోనల్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా రైల్వే ఉన్నతాధికారులు, ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్‌ను కలిశారు. పార్వతీపురంలో 2 రైల్వే స్టేషన్లు యథావిధంగా కొనసాగించాలని, కోరినట్లు తెలిపారు. అలాగే బెలగాం స్టేషన్ సమీపంలోని రైల్వే గేటును పదే పదే మూసి వేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి 18 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కావున రైల్వే వంతెన లేదా అండర్ పాసేజ్ నిర్మించాలని కోరినట్టు తెలిపరు. అలాగే పార్వతీపురం నుంచి రోజువారీ రాకపోకలు సాగించేలా హైదరాబాద్, తిరుపతికి రైళ్లు నడపాలని కోరారు.నర్సిపురం రైల్వే స్టేషన్ లో దుర్గ్ - విశాఖపట్నం, రాయగడ - గుంటూరు రైళ్ల హాల్టింగ్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని రైల్వే జీఎంను కోరుతూ వినతిపత్రం అందజేశారు.

మొండిబకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

డిసిసిబిలో రుణాలు తీసుకొని ఎవరైతే మొండిగా వ్యవహరిస్తున్నా రో వారంతా సెప్టెంబర్ నెలలోపు చెల్లించాలని, లేదంటే వారి ఆస్తులను జప్తు చేస్తామని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం డిసిసిబి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసిసిబిని లోతుగా అధ్యయనం చేశానని, బడా బాబులే ఎక్కువ శాతం రుణాలు తీసుకొని బకాయిలు చెల్లించలేదని తెలిపారు. డిపాజిట్లు సేకరణకు కృషి చేసి డిసిసిబిని సంస్థాగతంగా బలోపేతం చేస్తామన్నారు. రైతాంగం బాగుపడాలంటే సహకార రంగం బలోపేతం కావాలన్నారు. ఇందుకోసం తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. సోలార్ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు 80శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న చిన్న రౌడీ మూకలు బ్యాంక్ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తే పోలీసు కేసులు పెట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

పోలీసుల ఆధ్వర్యంలో బండ రాళ్లు తొలగింపు

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు కొండపై నుంచి పెద్దపెద్ద బండ రాళ్లు రహదారిపై పడడంతో వాహనదారులకు, బాటసారులకు ఆటంకం కలిగించింది. ఈ సందర్భంగా ధోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో బండ రాళ్లు తొలగించారు. దీంతో రహదారి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ త్రినాథరావు తదితరులు ఉన్నారు.

సీతంపేటలో సైబర్ నేరాలపై అవగాహన

స్థానిక ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత గురించి వివరించారు. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బార్లకు ముగిసిన దరఖాస్తులు

కంటోన్మెంట్ : నూతనంగా ప్రవేశపెట్టిన బార్ పాలసీ 2025- 2028 లో భాగంగా మద్యం బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. శనివారం ఓపెన్ కేటగిరి , గీత కులాలు సంబంధించిన బార్లు లాటరీ పద్ధతిలో కలెక్టర్ సమక్షంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో డ్రా తీయనున్నారు. జిల్లాలో ఓపెన్ కేటగిరి బార్లు ఏర్పాటుకు 51 దరఖాస్తులు, గీత కార్మికులకు కేటాయించిన మూడు బార్లుకు 21, పార్వతీపురం మన్యం జిల్లాలో ఓపెన్ కేటగిరిలో బార్‌లకు 9, గీత కార్మికుల కోటాలో 10 దరఖాస్తులు వచ్చాయి. ఒక బార్‌కు నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన వాటికే లాటరీ తీయనున్నారు. విజయనగరంలో 14బార్లు, పార్వతీ పురం జిల్లాలో నాలుగు బార్లకు లాటరీ ప్రక్రియ చేపట్టనున్నారు.

వీనుల విందుగా గాత్ర కచేరీ

విజయనగరం కోట : మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో గాత్ర కచేరీలు వీనుల విందుగా సాగుతున్నాయి. సంగీత నృత్య మహోత్సవాల సందర్భంగా జి. రాధా కుమారి, సిహెచ్ రామచంద్ర శేఖర్, విజయ వాడకు చెందిన మూల శ్రీలత గాత్ర కచేరీలు చేశారు. వీరికి పి.సురేష్ కుమార్, వి.గణేష్, ఎం.సత్య నారాయణ శర్మ, డాక్టర్ మండపాక రవి మృదంగం, వయోలిన్ తో సహ కరించారు. కార్యక్రమంలో కళాశాల

బస్సులో సీటు కోసం చెప్పలతో కొట్టుకున్నారు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆర్‌టిసి బస్సులో సీటు కోసం ఇద్దరు ప్రయాణికులు చెప్పులతో కొట్టుకున్న సంఘటన బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో చోటుచేసుకుంది. పార్వతీపురం డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు విశాఖపట్నం వెళ్లేందుకు బొబ్బిలి కాంప్లెక్స్‌లో శుక్రవారం ఆగింది. బస్సు సీటు కోసం ఒక మహిళ తన చున్నీ వేయగా... ఆ చున్నీ సీటులో లేకుండా కింద పడిపోయింది. దీంతో ఒక వ్యక్తి సీటులో కూర్చున్నాడు. ఆ మహిళ 'ఆ సీటుపై చున్నీ వేశాను, లెగండి' అని అడగ్గా, సీటుపై చున్నీ లేదని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని, చెప్పులతో కొట్టుకున్నారు. చివరికి ఆ వ్యక్తి సీటు ఖాళీ చేసి మహిళకు ఇచ్చేశాడు. వ్యక్తిపై మహిళ దురుసుగా ప్రవర్తించిందని తోటి ప్రయాణికులు చెబుతున్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆర్‌టిసి అధికారులను కోరారు.

చెప్పలతో కొట్టుకుంటున్న ప్రయాణికులు

కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

బిసి కార్పొరేషన్ ద్వారా కుట్టు మిషన్ల శిక్షణను దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా 90 రోజుల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్‌లో 67మందికి శిక్షణ ఇస్తున్నామని, శిక్షణా కార్యక్రమాన్ని ఇప్పటి వరకు 62 రోజుల వరకు శిక్షణ పొందుతున్నారని, మిగిలిన రోజుల్లో కూడా శిక్షణను వినియోగించుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన పాల్గొన్నారు.

నిందితుడి భార్య ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని లోవరకండిలో గురువారం జరిగిన గిరిజన యువకుడు కార్తీక్ హత్యలో నిందితుడిగా ఉన్న సాగరపు ఆది భార్య హేమలత (27) శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విచారణ నిమిత్తం పోలీసులు లోవరకండి రావడం, అప్పటికే ఆమె భర్త అరెస్టు కావడంతో మనస్తాపానికి గురైంది. పోలీసులతో ఆధార్ కార్డు తెస్తానంటూ ఆమె ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన స్థానికులు, పోలీసులు వెంటనే అప్రమత్తమై హుటాహుటిన పోలీసు వాహనంలోనే మక్కువ ప్రాథమిక ఆరోగ్యానికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం అక్కడ నుంచి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి హేమలతను తరలించారు. ప్రస్తుతం ఆమె కోలు కుంటున్నట్లు స్థానికులు తెలిపారు.

వరి సాగును పరిశీలించిన కెవికె బృందం

ప్రజాశక్తి - కురుపాం

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సభ్యులు డాక్టర్ ఎం.అనంత విహారి, డాక్టర్ ఎస్.ప్రవంతి కురుపాం నియోజకవర్గంలో గల పెదమేరంగి, అడ్డాపు శీల, శివ్వాం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను శుక్రవారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న వరి రకం బిపిటి 2841, చిరు సంచులు ఆర్‌జిఎల్ 7030, 7045 ప్రదర్శనను పర్యవేక్షించారు. బయోమెట్రిక్ గణంకాలు సేకరించి రైతులకు వరి దుబ్బులకు తెగుళ్లు, పురుగు చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.